




## 150 ఎకరాలు నీటి పాలు



మునిగిన పత్తి పంటను చూపుతున్న రైతు నజీర్‌సాహెబ్

**గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కి బ్యాక్ వాటర్ వస్తే ఎగువ ప్రాంత పంట భూములు ముంపునకు గురవుతున్నాయి. ఏళ్లు గడిచినా కష్టం తీరేదారి కనిపించడం లేదు. ఈప్రాజెక్టులో 377 మీటర్ల నీటిని నిలువ చేస్తే ఎగువ ప్రాంతంలో ఉన్న ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, గంజహళ్లి, దేవనకొండ మండలంలోని బీసెంటర్, బెల్లదొడ్డితో పాటు మరో రెండు గ్రామాలకు చెందిన పొలాలు వరద నీట మునిగిపోతున్నాయి. ఈ పొలాల మీదే ఆధార పడిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది సుమారు రూ.40లక్షలు నష్టం వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.**

- జీడీపీ బ్యాక్ వాటర్‌తో భూములు మునక
- రూ.40లక్షల పంట నష్టం
- పరిహారం ఇచ్చిన దాఖలు లేవు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న రైతులు

**గోనెగండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఈ ఏడాది జీడీపీలో 376.80 మీటర్లకు నీరు వచ్చి చేరింది. వారం రోజుల నుంచి 150 ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి. 20ఏళ్లగా జీడీపీకి వరద వస్తే ఎగువ ప్రాంత రైతులకు ఇవే కష్టాలు. పంటలు నీటిలో మునిగిపోవడం నష్టపరిహారం అంటూ రైతులు అధికారుల చుట్టూ తిరగడం పరిపాటిగా మారింది. పరిహారం ఇచ్చిన దాఖలాలు లేవు. జీడీపీ ఎగువ ప్రాంతంలో ఉన్న ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాలకు చెందిన పట్టా భూములు జీడీపీ నీటిలో మునిగిపోయాయి. సాగు చేసిన పంటలు నీట మునగడంతో దాదాపు రూ. 40 లక్షల మేర పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, గంజహళ్లి గ్రామాల రైతులకు చెందిన వేరుశనగ, పత్తి, మిరప, ఉల్లి, వరి, ఆముదాలు మొక్కజొన్న పంటలు ప్రాజెక్టు ఎగువ నీటిలో మునిగిపోయాయి. తమకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

### ప్రతి ఏడాది ఇదో పెద్ద సమస్య

గాజులదిన్నె ప్రాజెక్టులో 377 మీటర్ల నీటిని నిలువ చేస్తే ఎగువ ప్రాంతంలో ఉన్న ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, గంజహళ్లి, దేవనకొండ మండలంలోని బీసెంటర్, బెల్లదొడ్డితోపాటు మరో రెండు గ్రామాలకు చెందిన పంట పొలాలు వరద నీట మునిగి పోతున్నాయి. దీంతో ప్రతి ఏడాది ఈ గ్రామస్థులకు ఇదో పెద్ద సమస్యగా మారింది. ప్రాజెక్టు నిర్మాణా సమయంలో అధికారుల ముందుచూపు లేకుండా ప్రాజెక్టును నిర్మించారని కొందరు అధికారులు గుసగుసలాడుకుంటున్నారు.

### పూర్తిస్థాయిలో నీటిని నిల్వ..

ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయకపోతే రబీలో 12 నుంచి 15వేల ఎకరాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడం కష్టతరంగా మారుతుంది. డోన్, క్రిష్ణగిరి, బండగట్టు, కోడుమూరు, కర్నూలు, గూడురు, సి.బెళగల్‌తో పాటు అవసరసమయంలో మరి కొన్ని గ్రామాలకు తాగునీటి పథకాలకు నీరు అందించాల్సి ఉంది. తప్పనిసరిగా నీరు నిలువ చేయాల్సి ఉంటుంది. నీరు నిలువ పెడితే ఎగువ ప్రాంతంలోని రైతుల పొలాలు నీట మునుగుతున్నాయి. మరి ఈ సమస్యకు అధికారులు ఎలాంటి పరిష్కారం చూపుతారో వేచి చూడాల్సిందే.

### పంట నష్ట పరిహారమివ్వాలి

ప్రాజెక్ట్ వరద నీటిలో మునిగిపోయిన పంటకు ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇవ్వాలని ఐరన్‌బండ, ఎన్నెకండ్ల గ్రామ రైతులు నజీర్‌సాహెబ్, గఫూర్, షేక్‌సాబ్, ఉప్పరి వెంకటేశ్వర్లు, జరినాబేగం, బజారి, పెద్దరాముడ, తాయమ్మ, మల్లికార్జున తదితరులు డిమాండ్ చేస్తున్నారు.



నీట మునిగిన మిరప పంటను అధికారులకు చూపుతున్న రైతు మల్లికార్జున



నీట మునిగిన ఉల్లి పంటను చూపుతున్న రైతు

### సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



వరదలో మునిగిపోయిన పంటలకు సంబంధించి అధికారులు సర్వేలు జరిపారు. నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపాలి. ప్రభుత్వం తప్పని సరిగా పరిహారం అందజేయాలి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

● నజీర్‌సాహెబ్, రైతు, ఐరన్‌బండ

### సమస్యకు పరిష్కారం చూపండి



ప్రతి ఏడాది ప్రాజెక్టుకు వరదొచ్చి భూములు నీట మునుగుతున్నాయి. అప్పులే మిగులుతున్నాయి. పంటలు వరద నీటిలో మునిగిపోవడం సర్వసాధరణంగా మారింది. ఈ సమస్యకు అధికారులు ఎలాంటి పరిష్కారం చూపుతారో చెప్పాలి.

● వెంకటేశ్, రైతు, ఐరన్‌బండ

### నివేదిక ఉన్నతాధికారులకు పంపుతాం

ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని పొలాలు నీట మునిగాయి. పంట భూములను సర్వే చేయమని ఉన్నతాధికారులు ఆదేశించారు. రెండు రోజులుగా జీడీపీ, రెవెన్యూ అధికారులు కలసి నీట మునిగిన పొలాల్లో సర్వేలు జరిపాం. ఈభూములు ప్రభుత్వందా లేక రైతుదా అని నిర్ధారణ చేసుకొని నివేదలు తయారు చేసి త్వరలో ఉన్నతాధికారులకు పంపుతాం.

● మహమ్మద్ ఆలీ, ఏఈ, జీడీపీ, గోనెగండ్ల

## విద్యుత్‌శాఖ ఎస్‌ఈగా ప్రదీప్‌కుమార్



**కల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఏపీ ఎస్పీడీసీఎల్ కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈగా ప్రదీప్‌కుమార్ నియామకమయ్యారు. ఆదివారం సీఎండీ కే.సంతోషరావు కర్నూలు డీపీఈ విభాగం ఈఈగా పనిచేస్తున్న ఆయనకు కర్నూలు విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ ఎస్‌ఈగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా గార్గేయపురం వాసి అయిన ఆర్.ప్రదీప్‌కుమార్ విద్యుత్ శాఖలో 17-11-1991 ఏఈఈగా ఆర్టీపీపీ కార్యాలయంలో విధులు ప్రారంభించారు. కర్నూలు ఆపరేషన్ డివిజన్ ఈఈగా కూడా ఆర్.ప్రదీప్‌కుమార్ పని చేశారు. అనంతరం 1998 నుంచి నేటి వరకు వివిధ విభాగాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో డీఈఈ, ఈఈగా పనిచేస్తున్నారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

**సీజీఎంగా ఉమాపతికి పదోన్నతి**

విద్యుత్ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి తిరుపతి కార్పొరేట్ ఆఫీసులో సీజీఎంగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఏపీ ఎస్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆర్ఏసీ-ఐపీసీ విభాగం సీజీఎంగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన సీజీఎంగా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

## జీడీపీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల



గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీకి విడుదలవుతున్న నీరు

**గోనెగండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** గాజులదిన్నె ప్రాజెక్టు 4వ గేటు నుంచి ఆదివారం 330 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం నీటి విడుదల చేశారు. అయితే గత నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టుకు నాలుగు రోజుల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం ఉదయం ప్రాజెక్టుకు 400 క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జీడీపీ ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 4 టీఎంసీల వరద నీరు చేరింది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు నీటి మట్టాన్ని బట్టి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, దేవనకొండ, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాలలో వర్షాలు కురియడంతో వరద నీరు వచ్చి జీడీపీకి చేరుతోంది.

## నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



**శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారి ఆలయ మండపంలో 9 గంటలకు యాగశాల ప్రవేశం చేసి గణపతి పూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికా దేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు. ఏర్పాట్లపై ఈవో ఎం.శ్రీనివాసరావు వివారాలు వెల్లడించారు. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 50 మంది ఋత్విలకు పిలిపించినట్లు తెలిపారు.

**రేపటి కార్యక్రమాలు**

అమ్మవారు రెండో రోజు మంగళవారం బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లు మయూర వాహనంపై విహరించనున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ సిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

## శ్రీశైలానికి పెరిగిన వరద

- 10 గేట్ల ద్వారా నీటి విడుదల



**శ్రీశైలం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలం జలా శయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరిగింది. అధికారులు పది గేట్ల ద్వారా 2,75,700 క్యూసెక్కుల నీటిని దిగువ సాగర్‌కు సాగనంపుతున్నారు. ఎగువ జూరాల స్పిల్‌వే, విద్యుదుత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 2,37,023 క్యూసెక్కులు వచ్చి చేరింది. ఆదివారం సాయంత్రం డ్యాం నీటిమట్టం 883 అడుగులుగా ఉండగా నీటి నిల్వ సామర్థ్యం 209 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 65,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గడిచిన 24 గంటల్లో 31 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.

## శ్రీమఠంలో స్వర్ణ పల్లకీ ఉత్సవం



స్వర్ణ పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్ర స్వామి

**మంత్రాలయం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం బాద్రపద అమావాస్య శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. రాఘవేంద్రస్వామి ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి అంగరంగ వైభ వంగా ఊరేగించారు. ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తులు తరలివచ్చారు. అనంతరం ఊంజల సేవ నిర్వహించారు.

## వైసీపీ బురద చల్లడం సిగ్గుచేటు

- ఉల్లి రైతులను ప్రభుత్వమే ఆదుకుంటుంది
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

**మంత్రాలయం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉల్లి రైతులు కష్టాల్లో ఉంటే వైసీపీ నాయకులు బురద చల్లే రాజకీయాలు చేయడం సిగ్గుచేటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం మంత్రాలయంలో టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకు నేందుకు దేశంలో ఎక్కడా ఇవ్వని నష్టపరిహారం ఏపీలోనే హెక్టారుకు రూ.50వేలు అందిస్తున్నారు. మంత్రాలయం, ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజక వర్గాల నుంచి అధికంగా భూములున్న రైతులు సైతం వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసల నివారణ కోసం ఆర్డీఎస్, వేదవతి, గుండ్రేవుల, గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ శాఖమంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిధులు మంజూరు చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేష్ స్వామి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, విజయరామిరెడ్డి, వగరూరు అబ్దుల్లా, భరద్వాజ్‌శెట్టి, కృష్ణమోహన్ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 600ల క్వింటాళ్ల ఉల్లి అమ్మకం

- మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి



**కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో 600ల క్వింటాళ్ల ఉల్లిని అమ్మినట్లు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1,250 బస్తాల ఉల్లిగడ్డలను వినియోగదారులకు విక్రయించామని, మరి కొంతమొత్తంలో రాష్ట్రంలోని రైతుబజార్లకు తరలించామన్నారు. సోమవారం నుంచి ఇప్పటిదాకా అమలైన క్వింటానికి రూ.1,200 మద్దతు ధర ఉండదని, రైతులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం ఉల్లి సాగు చేసిన ప్రతి రైతుకు హెక్టారుకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించేందుకు నిర్ణయించారని, అందువల్ల రూ.1,200ల మద్దతు ధర ఇక అమలులో ఉండదన్నారు. సమావేశంలో సెక్రెటరీలు రెహిమాన్, వెంకటేశ్వర్లు, సుందర్ రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నాగేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉల్లి కోసం పరుగులు

- బస్తా రూ.100కు అమ్మకం
- జాతరను తలపించిన యార్డు ఆవరణం



ఉల్లి కోసం క్యూలో నిలబడ్డ ప్రజలు

**కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి కోసం నగర ప్రజలు పరుగులు పెట్టారు. ఆదివారం యార్డు ప్రాంతమంతా జాతరను తలపించింది. కలెక్టర్ సిరితో పాటు జేసీ నవ్య యార్డులో కలియ తిరుగుతూ పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, మార్కెట్ కమిటీ యార్డులను సమన్వయ పరిచి ఉల్లి అమ్మకాల్లో తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ అధికారులు 19వేల క్వింటాళ్ల ఉల్లిని యార్డులో నిల్వ ఉంచారన్నారు. ఈ ఉల్లిని త్వరితగతిన బయటకు తరలించేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ఒక బస్తా ఉల్లి (45కిలోలు) రూ.100 అమ్మేందుకు నాలుగు కౌంటర్లను యార్డులో ఏర్పాటు చేశామన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం రాజు, మార్కెట్ కమిటీ సెక్రెటరీ జయలక్ష్మి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్



## ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

### విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

### నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

## ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

### అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

### నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

### కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

### తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

### తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాటు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

### విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాలిత మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### 27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

## నేటి నుంచి శరన్నవరాతి ఉత్సవాలు

- ఉమ్మడి జిల్లాలోని ఆలయాల్లో ఏర్పాట్లు
- అమ్మవారికి రోజువారీ అలంకరణలు



విద్యుత్ కాంతులతో కర్నూలులోని చిన్నఅమ్మవారిశాల

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా వేడుకను పురస్కరించుకొని దుర్గామాతను ఆరాధిస్తూ తొమ్మిది రోజుల పాటూ కొనసాగే 'దేవీ నవరాత్రి ఉత్సవాలు' ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా ఆరంభమవుతున్నాయి. ఏటా ఆశ్వయుజ మాసంలో పాడ్యమి నుంచి దశమి వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో దసరా పండుగకు ముందుగా తొమ్మిది రోజుల పాటు దేవీ నవరాత్రి ఉత్సవాలు సంప్రదాయబద్ధంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మహాశైవ క్షేత్రాలైన శ్రీశైలం, మహానందితోపాటూ వివిధ క్షేత్రాల్లో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలు (అమ్మవారి శాలల్లో), చౌడేశ్వరి దేవి ఆలయాలు దేవీ నవరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఆయా దేవాలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉత్సవాల ప్రత్యేకతను చాటేలా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవారిని తొమ్మిదిరోజుల పాటు తొమ్మిది రూపాల్లో విశేష అలంకరణలు చేసి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలు శరత్ కాలంలో వస్తున్నందున 'శరన్నవరాత్రి వేడుకల' పేరుతోనూ జిల్లాలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

#### మహాశక్తి స్వరూపిణిగా అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన మాతకు దేవీ భాగవతంలో త్రిమూర్తుల కన్నా అధిక ప్రాధాన్యత కల్పించారు. విజయం చేకూరాలంటే ఈ శక్తిని అందుకోవడం తప్పనిసరిగా వర్ణించారు. నవవిధ అవతారాలను అత్యంత భక్తితో పూజించే పర్వదినాలే దేవీ నవరాత్రులు. త్రిశక్తుల ఏకీకరణ సమన్వయాన్ని సాధించే దిశలో ఆదిశంకరాచార్యులు మహాలక్ష్మిని కనకధార స్తోత్రంలో కీర్తించారు. వైదిక సంప్రదాయంలో దేవీమాతను త్రిమూర్తుల శక్తిగా తెలియజేశారు. మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతిగా కొలుస్తారు. మహాకాళిని శత్రు నిర్మూలనకు, మహాలక్ష్మిని ఐశ్వర్య సౌభాగ్య సంపదలకు, సరస్వతిని విద్య విజ్ఞానానికి అధిష్ఠాన దేవతగా భావిస్తారు. విశ్వసృష్టికి నాంది పలికిన జగన్మాతగా దుర్గామాతను పూజిస్తారు. బ్రహ్మ, విష్ణువు, శివపరమాత్మ కూడా దేవదేవిని పూజించారని హైందవ పురాణాలు చెబుతున్నాయి. దుర్గామాత అయిన దేవదేవిని తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రూపాల్లో పూజించాలి. నేయి దీపాలు వెలిగించి, నిత్యం హోమాలు, పూజలు, అష్టోత్తర నామ పారాయణం, స్తుతి, భజనలతో ఆరాధించాలి. అరిషడ్ గుణాలను వదులుకొని దేవీ ఆరాధనలో గడిపేవారికి ఆమె కరుణా కటాక్షాలు ప్రసాదిస్తుందని పండితులు పేర్కొంటారు.

#### నవరాత్రుల్లో అమ్మవారి అలంకరణలు

దేవీ నవరాత్రి వేడుకల్లో తొమ్మిది రోజుల పాటు దేవదేవి అయిన దుర్గమ్మను తొమ్మిది రూపాల్లో దర్శిస్తారు. ఈ తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో దుర్గామాతను అలంకరించి, విశేష పూజలు నిర్వహిస్తారు. శైలపుత్రి, బాల త్రిపురా సుందరీ దేవి (బ్రహ్మచారిణి), చంద్రఘంటా దేవి (గాయత్రీ దేవి), అన్నపూర్ణా దేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, మహాలక్ష్మి దేవి, మహా సరస్వతీదేవి, దుర్గాదేవి (దుర్గాష్టమి), మహిషాసుర మర్దిని (మహార్ణవమి), రాజరాజేశ్వరి (విజయ దశమి) రూపాల్లో భక్తులు అమ్మవారిని పూజిస్తారు.



### ఆహ్లాదభరితం.. నల్లమల సోయగం

నల్లమల అందాలు ఆహ్లాదభరితంగా ఉన్నాయి. పచ్చదనంతో నిండిపోయిన అడవికి తెల్లటి పొగమంచు దుప్పటి కప్పేసింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మహానందికి అత్యంత సమీపంలోని నల్లమల అడవికి పొగమంచు కప్పినట్లు ఉన్న దృశ్యాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మరో ఊటీ అందాలను తిలకించినట్లు ఉందని మహానందికి దర్శనం కోసం వచ్చిన భక్తులు హర్షం వ్యక్తంచేశారు. ఈముగ్ధ మనోహర దృశ్యాలను ఆదివారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- మహానంది, ఆంధ్రజ్యోతి

### సనాతన ధర్మంపై చైతన్యం తీసుకురావడానికి పాదయాత్రలు

- ఇస్కాన్ ప్రతినిధి ఆచార్య దాస్



చాగలమర్రిలో పాదయాత్ర చేస్తున్న ఇస్కాన్ సభ్యులు

చాగలమర్రి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పాదయాత్రలు చేపట్టినట్లు ఇస్కాన్ ప్రతినిధి ఆచార్య దాస్ అన్నారు. ఇస్కాన్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం చాగలమర్రికి చేరుకుంది. సనాతన ధర్మం, నగర సంకీర్తన కోసం ఎద్దుల బండితో 25 మంది భక్తబృంద సభ్యులతో పాదయాత్ర చేపట్టారు. ఇప్పటికే ఆరు సార్లు పూర్తిచేసుకొని ప్రస్తుతం ఏడో సారి దేశవ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆచార్య దాస్ మాట్లాడుతూ కేధర్‌నాథ్, బద్రినాథ్, ద్వారక, పలు క్షేత్రాలను తిరిగామన్నారు. అక్కడి నుంచి మంగళగిరి, గుంటూరు, మార్కాపురం, గిద్దలూరు మీదుగా నంద్యాల, రుద్రవరం, అహోబిలం సందర్శించి చాగలమర్రికి చేరుకున్నామన్నారు. స్థానిక అయ్యప్ప, సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీధుల గుండా ఎద్దులబండితో నగర సంకీర్తన, భగవద్గీత, రామాయణం, గ్రంథాల వితరణ, ప్రసాద వితరణతో పాదయాత్ర చేశారు. వీరికి హిందూ సంఘ నాయకులు స్వాగతం పలికారు. సోమవారం నుంచి కడప జిల్లాలో పాదయాత్ర సాగుతుందని, ప్రతి రోజు ఎద్దులబండితో పాటు 10కిలోమీటర్లు యాత్ర చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జనార్ధన్, లక్ష్మీనారాయణ, వినోద్‌కుమార్, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

### పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్
- ఘనంగా రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు



స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

నంద్యాల హాస్పటల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ఏదో ఒక క్రీడల్లో ప్రోత్సహించాలని నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాల మార్కెట్ యార్డులో క్రీడాభారతి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు జరిగాయి. ఈపోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం తల్లిదండ్రులు తమ పిల్లలను చదువులోనే ప్రోత్సహిస్తున్నారన్నారు. పిల్లలకూడా సెల్‌ఫోన్లకు పరిమితమై ఆటలను విస్మరిస్తున్నారని అన్నారు. క్రీడాభారతి జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ స్కేటింగ్ క్రీడ జిల్లాలో కొన్ని పాఠశాలల్లో ఉందని, ఈ క్రీడాభివృద్ధికి కృషిచేస్తామన్నారు. జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో నంద్యాల, కర్నూలు, కడప, జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలకు కప్పు, మెడల్స్ ముఖ్య అతిథులు ప్రదానం చేశారు. క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి రామక్రి ష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి . నిమ్మకాయల సుధాకర్, హేమంత్‌రెడ్డి, ఖలీల్, గెలివి వెంకటేశ్వర విద్యాలయ కరస్పాండెంట్ గెలివి వశిష్ఠ పాల్గొన్నారు.





విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

### ఉరుకుంద ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు



వెండి అలంకరణలో దర్శనమిస్తున్న స్వామి వారు

కౌతాళం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈఓ వాణి ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేకంగా అలంకరించారు. తూర్పు రాజగోపురం నుంచి ఆలయ అధికారులు భక్తులకు స్వామివారి దర్శనం కల్పిం చారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. మరి కొంత మంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యం సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలోని అన్నదాన సత్రంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### సీమ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి

- కుంచం వెంకటసుబ్బారెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నేతలు వెనుకబడిన ప్రాంతాల శాశ్వత అభివృద్ధికోసం పాటుపడాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం 88 ఏళ్ల క్రితం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందని, కానీ అమలుకు నోచుకోకపోవడమే రాయలసీమ వెనుకబాటుకు కారణమన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, సమగ్ర అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక రాష్ట్రంగానీ, గతంలోని జరిగిన ఒప్పందాల అమలు మాత్రమే పరిష్కారమని స్పష్టం చేశారు. నవంబరు 16లోగా శాశ్వత పరిష్కారానికి రాయలసీమ నాయకులు సిద్ధం కావాలన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల నీటి వినియోగంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమానంగా శాసనసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

# కోడుమూరులో డెకాయ్ ఆపరేషన్

● రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న వైద్య బృందం
● పరారైన వైద్యుడు ● ప్రైవేటు ఆస్పత్రి సీజ్



ఆస్పత్రిని సీజ్ చేసిన కర్ణాటక, కర్నూలు వైద్య బృందం

**కోడుమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని బాషా నర్సింగ్ హోమ్‌పై ఆదివారం సాయంత్రం డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో పీసీ పీఎన్‌డీటీ స్టేట్ నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, కర్ణాటక పీసీ పీఎన్‌డీటీ స్టేట్ వివేక్‌దొరై, డీఎంహెచ్‌వో శాంతికళ సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి ఆస్పత్రిని సీజ్‌చేసినట్లు తెలిపారు. వివరాలు.. కర్ణాటకలో వచ్చిన ఫిర్యాదు మేరకు కర్ణాటక, కర్నూలు వైద్యం బృందం సహకారంతో డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. ఇందులో భాగంగా ఆరునెలల గర్భిణికి మైక్ ఏర్పాటు చేసి బాషా నర్సింగ్ హోమ్‌కు పంపించారు. కొంత డబ్బు తీసుకొని లింగనిర్ధారణ పరీక్షలు చేసి గర్భంలో ఉన్నది ఆడ శిశువు అని వైద్యుడు నిర్ధారించాడు. ఈ సమయంలో వైద్య బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పరీక్షలు నిర్వహించిన యునాని వైద్యుడు అక్కడి నుంచి పరారయ్యాడు. నిబంధనల ప్రకారం ఆస్పత్రిని సీజ్‌చేశారు. అక్కడ చికిత్స పొందుతున్న ఏడుగురు రోగులను మరో హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందిస్తున్నారు. బహిరంగంగా లింగనిర్ధారణ పరీక్షలు చేపట్టడంపై స్టేట్ నోడల్ ఆఫీసర్ జిల్లా వైద్యాధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

**గతంలో కూడా ఈ ఆస్పత్రిపై..**

బాషా నర్సింగ్‌హోమ్‌లో కొన్నేళ్ల నుంచి లింగనిర్ధారణ పరీక్షలు చేపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో కూడా ఈ ఆస్పత్రిపై దాడులు నిర్వహించి సీజ్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయినప్పటికీ ఆస్పత్రి నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు లేదు. దీంతో కర్ణాటక, ఏపీలోని పలు జిల్లాల నుంచి గర్భిణులు ఇక్కడికి వచ్చి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకొని వెళ్తుంటారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి అధికారులు కొన్ని సంవత్సరాల కిందట దాడులు చేపట్టి ఆసుపత్రిని సీజ్‌చేశారు. ఇంత జరిగినా ఇదే ఆస్పత్రిలో బహిరంగంగా లింగనిర్ధారణ చేపట్టడంపై అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

**ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని బనవాసి ఫారం కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. వివరాలు.. ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల గ్రామానికి చెందిన వెంకట రాముడు(43) ఆదోనిలో పనిముగించుకొని కడివెళ్లకు తిరుగు ప్రయాణమయ్యాడు. తిరుగు ప్రయాణంలో బస్సెక్కి ఆరెకల్లు గ్రామంలో దిగి నడుచుకుంటూ ఎమ్మిగనూరు వైపు వస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

## బాలిక మృతి

**గడివేముల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెసరవాయి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందింది. ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గడివేములకు చెందిన ఉసేన్‌బాష, మౌలాబి దంపతులు కుమార్తె అఫ్రిన్‌తో కలిసి ఆదివారం ద్విచక్రవాహనంలో బోదనంకు వెళ్తున్నాడు. పెసరవాయి గ్రామ సమీపంలోని వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో బైక్ అదుపు తప్పింది. అఫ్రిన్(6) తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## విగ్రహ ధ్వంసం కేసులో వ్యక్తి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ రవిశంకర్‌రెడ్డి

**ఆలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మనేకుర్తి గ్రామంలో భక్త కనకదాసు విగ్రహం ధ్వంసం కేసులో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. మనేకుర్తి గ్రామంలో కురువ సామాజికవర్గానికి చెందిన సర్పంచ్ కంటెప్పగారి దేవేంద్ర వర్గానికి, కేసులో నిందితుడైన మరకట్టు భగవంతప్ప వర్గానికి కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు విషయంలో వివాదం కొనసాగుతోంది. సర్పంచ్ వర్గీయులు గ్రామంలో జాతీయ రహదారి పక్కన విగ్రహ ఏర్పాటుకు నిర్ణయించారు. మరో వర్గం ఒప్పుకోకపోయినా అలాగే విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఆతర్వాత సర్పంచ్ వర్గీయులు అవమానకరంగా, రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీంతో జీర్ణించుకోలేకపోయిన మరకట్టు భగవంతప్ప మద్యం మత్తులో కనకదాసు విగ్రహం ఎడమచెయ్యి, వీణను పగలగొట్టాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. కమ్మరచేడు గ్రామ ఢాబా వద్ద ఉన్న మరకట్టు భగవంతప్పను ఆలూరు ఇన్‌చార్జి ఎస్ఐ మారుతి, సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. విచారించగా అసలు నిజాన్ని ఒప్పుకున్నాడని, నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మిద్దెపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**ఆళ్లగడ్డ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** తల్లి మందలించిందని ఓ విద్యార్థి మిద్దెపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం పట్టణంలో టిడ్కో గృహాల్లో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కాలనీకి చెందిన బాలుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువాడు. మూడు సార్లు పదో తరగతి ఫెయిల్ అయ్యాడు. దీంతో వ్యసనాలకు బానిసయ్యాడు. వ్యసనాలు మాని బాగా చదువుకోవాలని తల్లి మంద లించింది. మనస్థాపానికి గురైన అతడు నాలుగో అంతస్థు నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


## గంజాయి స్వాధీనం.. నలుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

**నందికొట్కూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** గంజాయి కేసులో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి అక్రమంగా తెచ్చి పట్టణ శివారులో విక్రయిస్తుండగా 1,100 గ్రాముల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ పట్టణానికి చెందిన కావేటి రాజు, పింజరి మహబూబ్ బాషా, దూదేకుల ముర్తుజావళి, షేక్ సోహెల్ గంజాయి అమ్ముతూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికారని చెప్పారు. ఈ నలుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. మరో వ్యక్తి ఆత్మకూరుకు చెందిన కావేటి నాగశేషాద్రి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సమర్థవంతంగా పనిచేసిన ఎస్ఐ చంద్రశేఖర్‌ను సీఐ అభినందించారు.

# మనోధైర్యం.. జీవన విజయం



క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి. ధూమపానం, మద్యపానం, పురుగుమందుల అవశేషాలున్న ఆహార పదార్థాలు తీసుకోవడం వంటివి క్యాన్సర్‌కు ప్రధాన కారకాలుగా వైద్యు లు చెబుతున్నారు. చిన్నారులు, పెద్దలు, మహిళలు క్యాన్సర్ బారిన పడుతున్నారు. చాలా మంది సెలబ్రిటీలు, హీరోలు, క్రీడాకారులు మనోధైర్యంతో క్యాన్సర్‌ను జయించారు. ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతున్నారు. క్యాన్సర్ రోగులకు ఓదార్పునిస్తూ అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏడాది సెప్టెంబరు 22న వరల్డ్ రోజ్ డే (క్యాన్సర్ బాధితుల సాంత్వన దినం)ను నిర్వహిస్తున్నారు. సోమవారం వరల్డ్ రోజ్‌డే సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

● క్యాన్సర్ రోగికి చికిత్స కంటే సాంత్వన ముఖ్యం
● ప్రత్యేక కౌన్సిలర్లు అవసరం
● నేడు వరల్డ్ రోజ్ డే

**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధిని జయించవచ్చు. క్యాన్సర్‌తో పోరాడే వారు కోలుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, గులాబీ పువ్వు, యాపిల్ పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు చెప్పడమే వరల్డ్ రోజ్ డే ముఖ్య ఉద్దేశం. కెనడాకు చెందిన మిలిండా రోజ్ అనే 12 ఏళ్ల బాలిక అస్కిన్ ట్యూమర్ అనే అరుదైన రక్త క్యాన్సర్‌కు గురైంది. అప్పటికే ఆరోగ్యం క్షీణించడంతో రెండు వారాలకు మించి బతకదని వైద్యులు చెప్పారు. మనోధైర్యంతో నిండుగా ఉన్న ఆబాలిక క్యాన్సర్‌కు ఏమాత్రం భయపడ లేదు. ఆసుపత్రిలో తనతో పాటు ఉన్న క్యాన్సర్ రోగులతో ఉత్సాహంగా గడిపేది. తోటి రోగులకు గులాబీ పూలుఇచ్చి త్వరగా కోలుకోవాలని ప్రార్థించేది. బంధువులు, మిత్రులకు ఉత్తరాలు రాసేది. కవిత్వం రాస్తూ ఉల్లాసంగా కాలం గడిపేది. రెండు వారాల కంటే ఎక్కువ బతకదు అనుకున్న మెలిండారోజ్ ఆరునెలలు జీవించింది. 1894 సెప్టెంబరు22న మరణించింది. ఆబాలిక ఇచ్చిన స్ఫూర్తితో ఎందరిలోనూ ఆలోచలన రేకెత్తించింది. క్యాన్సర్ రోగులకు మానసికంగా ధైర్యంకల్పించి త్వరగా కోలుకోవాలని కోరుతూ సెప్టెంబరు 22న వరల్డ్ రోజ్‌డేను పాటిస్తున్నారు.

**ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు**

ఉమ్మడి జిల్లాలోని నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ కింద(ఎన్‌సీడీ) క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. మగవారిలో నోటి, ఊపిరితిత్తులు, స్త్రీల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మహిళల కోసం 950 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఎన్‌సీడీ-3.0 కింద జిల్లాలో 43 మందికి నోటి క్యాన్సర్, 40 మందికి రొమ్ము, 24 మందికి మహిళలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లు ఉన్నట్లు గుర్తించారు.

**రాయలసీమలోనే అధికం**

రాయలసీమ జిల్లాలో ఎక్కువగా మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లు వస్తున్నాయి.

**రోగులకు భరోసా అవసరం**



క్యాన్సర్ రోగులకు సాంత్వన కలిగించడం ప్రధాన అంశం. రోగులకు వైద్యులు చికిత్సకు వచ్చే సమయంలో వారితో మాట్లాడి భరోసా కల్పిస్తుంటాం. వ్యాధి ఏ స్థాయిలో ఉన్నా రోగులకు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉంటే జయించొచ్చు.

● డాక్టర్ రవీంద్రబాబు, సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు, ఓమేగా హాస్పిటల్, కర్నూలు

**నోటి క్యాన్సర్లు అధికం**



జిల్లాలో నోటి క్యాన్సర్ కేసులు అధికంగా వస్తున్నాయి. ముఖ్యంగా బీడీ, సిగరెట్, గుట్కా వాడటంతో పురుషుల్లో ఈ వ్యాధి అధికమవుతోంది. క్యాన్సర్‌కు అధునాతన చికిత్స విధానాలు, మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులు ఆందోళన చెందకుండా ధైర్యంతో ముందుకెళ్లాలి.

● డాక్టర్ వాసురెడ్డి, సర్జికల్ అంకాలజిస్టు, వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, కర్నూలు

పురుషుల్లో నోటి క్యాన్సర్లు అధికంగా కనిపిస్తున్నాయి. పొగాకు, పొగాకుకు చెందిన ఉత్పత్తులు వినియోగించిన వారిలో ఎక్కువగా నోటి, ఊపిరితిత్తులు క్యాన్సర్లు వస్తున్నాయి. స్త్రీల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు స్థూలకాయం, సంతాన లేమి వంటి కారణాలతో రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తించారు.

# వీడిన వ్యక్తి అదృశ్యం మిస్టరీ

● ఆస్తుల విషయంలో దాయాదుల మధ్య వివాదం
● అడ్డు తొలగించుకోవాలని హత్యకు కుట్ర
● చక్కరాళ్ల గ్రామ సర్పంచ్‌కు రూ.1.30 లక్షలకు కాంట్రాక్టు
● మద్యం తాగడానికి తీసుకెళ్లి హత్య చేసిన కిరాయి ముఠా
● మృతదేహాన్ని ప్యాపిలి వద్ద లంకాయపల్లిలో పూడ్చిపెట్టిన దాయాదులు



ప్యాపిలి చెరువులో వెలికితీసిన శరీర భాగాలను చూపిస్తున్న సీఐ జయన్న

**పత్తికొండ/ప్యాపిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఓ వ్యక్తి కనిపించడంలేదని ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులకు ఆస్తుల విషయంలో తలెత్తిన వివాదంలో దాయాదులు హత్య చేసినట్లు గుర్తించారు. పత్తికొండ మండలంలోని చక్కరాళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను పత్తికొండ సీఐ జయన్న ఆదివారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. చక్కరాళ్ల గ్రామానికి చెందిన లింగాయపల్లి పద్మనాభరెడ్డికి (37) క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన శిరీషతో వివాహయింది. రాతిదూలం పోటీలలో ఎద్దులను తోలడం వృత్తిగా చేసే పద్మనాభరెడ్డి ఆ వృత్తి కోసం నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండేవాడు. తన భర్త పద్మనాభరెడ్డి ఈ ఏడాది మే 13 నుంచి కనిపించడం లేదని ఆయన భార్య ఈ నేపథ్యంలో ఆగస్టు 28న ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు వ్యక్తి అదృశ్యం కింద పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. గ్రామంలో అనుమానితులతో పాటు ఆయనతో పరిచయం ఉన్న వ్యక్తులను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. గ్రామంలో స్థలం విషయంలో దాయాదులతో మే 5వ తేదీ పద్మనాభరెడ్డికి వివాదం జరిగినట్లు ఆ వివాదంలో దాయాదులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి మరికొందరితో కలసి ఆయనపై దాడిచేసినట్టు విచారణలో గ్రామస్థులు తెలపడంతో ఆ వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. భయపడ్డ నిందితులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీరాములు శనివారం గ్రామ వీర్వో తలారి కృష్ణ వద్ద లొంగిపోయారు. తామే పద్మనాభరెడ్డిని హత్య చేసినట్లు ఒప్పుకొన్నారు. నిందితులను ఆయన పత్తికొండ సీఐ జయన్నకు అప్పగించారు. విచారణలో నిందితులు హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

**హత్యకు పథకం ఇలా..**

గ్రామంలో తనకు సంబంధించిన 40సెంట్ల స్థలాన్ని పద్మనాభరెడ్డి సెంటు రూ .40వేల చొప్పున గ్రామస్థులు కొందరికి విక్రయించాడు. అందుకోసం వారి వద్ద నుంచి రూ. 1.30 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. అయితే వారసత్వంగా వచ్చిన ఆస్తులన్నీ ఇప్పటికే అమ్ముకున్నావని, ఈస్థలాన్ని అమ్మేందుకు తాము అంగీకరించబోమని దాయాదులు రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి అడ్డుకున్నారు. దీంతో మే 5న వారి మధ్య వివాదం జరిగింది. ఈవివాదంలో రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలో మరికొందరితో కలసి ఇనుపరాడ్డుతో దాడిచేసి తీవ్రంగా గాయపడిని పద్మనాభరెడ్డిని ఆటోలో ఆయన తండ్రి ఉండే రాంపురం గ్రామంలో వదిలివేశారు. గాయాల నుంచి తేరుకున్న పద్మనాభరెడ్డి తనపై దాడిచేసిన వారిని వదలబోనని కొందరు గ్రామస్థులతో చెబుతుండేవాడు. దీంతో అతడి నుంచి తమకు హాని ఉందని భావించిన దాయాదులు హత్యచేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం సర్పంచ్ శ్రీరాములు



పద్మనాభరెడ్డి (ఫైల్)

(వైసీపీ)కు రూ 1.30 లక్షలు కాంట్రాక్టు ఇచ్చారు. దీంతో పద్మనాభరెడ్డిని హత్యచేసేందుకు పథకం రచించిన సర్పంచ్ శ్రీరాముడు తమ్ముడు సిద్ధరాముడుతో పాటు గంపఆయ్యన్న, ఎద్దులదొడ్డి శ్రీరాములు, ప్రసాద్‌తో పాటు మరికొందరు రాంపురం సమీపంలో ఉన్న సుంకులమ్మ దేవాలయం వద్ద మద్యం తాగేందుకు పద్మనాభరెడ్డిని తీసుకెళ్లారు. రాళ్లతో కాళ్లపై దాడిచేసి లుంగీని గొంతుకు బిగించి హత్యచేసి మృతదేహాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయారు. అయితే మృతదేహాన్ని అక్కడే వదిలేస్తే ఎలా అని కాంట్రాక్టు ఇచ్చిన దాయాదులు ప్రశ్నించారు. మీరు ఇచ్చిన డబ్బుకు అంతకంటే పనిచేయలేమని సర్పంచ్ శ్రీరాములు వారికి సమాధానం ఇవ్వడంతో పద్మనాభరెడ్డి మృతదేహాన్ని రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి ప్యాపిలి సమీపంలో లంకాయపల్లి చెరువులో గడ్డిపొదలనడుమ పూడ్చివేసి దానిపై రాళ్లుపెట్టారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం పత్తికొండ తహసీల్దార్, డోన్ అగ్నిమాపకశాఖ సిబ్బంది, ఫోరెన్సిక్ సిబ్బంది సమక్షంలో లంకాయపల్లి చెరువులో పద్మనాభరెడ్డి పుర్రె, ఎముకలను వెలికితీశారు. నంద్యాల మెడికల్ కళాశాల ప్రొఫెసర్ హరికృష్ణ ఆధ్వర్యంలో శవపంచానామా నిర్వహించామని, పుర్రె, ఎముకలు గుర్తుపట్టలేని పరిస్థితులలో ఉండడంతో వాటిని డీఎన్ఏ పరీక్షలకు పంపుతున్నామని సీఐ జయన్న తెలిపారు. ఈహత్యకు సంబంధించి రాజశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సర్పంచ్ శ్రీరాములును కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. ఈహత్య కేసుకు సంబంధించి మరో 11 మందిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు.



దుండగులు శవాన్ని పూడ్చిన చెరువు ఇదే

## పట్టణంలోని మూడిళ్లలో చోరీ

● అర తులం బంగారు, రూ. 32వేలు నగదు అపహరణ

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** వీవర్స్ కాలనీ దర్గాలైన్‌లో శనివారం రాత్రి మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాలు.. వీవర్స్‌కాలనీలో పురుషోత్తం, రవికుమార్, సురేష్ పక్కపక్క పోర్షన్లలో నివాసం ఉంటున్నారు. ఇరువురు ఇళ్లకు తాళాలు వేసి అమావాస్య పూజలు ఉండటంతో ఊరికెళ్లారు. ఒకరు మాత్రం ఇంట్లోనే నిద్రిస్తున్నాడు. రెండిళ్ల తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లారు. ఆ పక్కనే ఉన్న మరో ఇంటి రేకును కోసి ఇంట్లోకి వెళ్లి అర తులం బంగారు, రూ.32వేల నగదు దోచుకెళ్లారు. ఆదివారం సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## ఘర్షణ కేసులో అరెస్టు

**నంద్యాల టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెద్దకొట్టాల గ్రామంలో ఇటీవల ఘర్షణ పడ్డ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ ఈశ్వర్వయ్య తెలిపారు. వివరాలు.. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెద్దకొట్టాలలో చిన్నబాబు, సంటెన్న మధ్య జరిగిన ఘర్షణలో సంటెన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేరకు చిన్నబాబు, రమేష్, సుబ్బన్న, కిషోర్‌కుమార్, వెంకటేశ్వర్లు, సుంకన్న, కరుణాకర్, సువార్తమ్మపై కేసు నమోదు చేసి అరెస్ట్‌చేసినట్లు తెలిపారు.

# చిట్టితల్లీ.. నిశ్చింతగా చదువుకో

● సోషల్ మీడియా వేదికగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
● కేజీబీవీలో చేర్చిన డీఈవో, అధికారులు
● 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటాం
● విద్యార్థిని జెస్సీ తల్లిదండ్రులు





విద్యార్థిని జెస్సీ, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** 'చిట్టి తల్లీ.. ఇక నిశ్చింతగా చదువుకో.. కేజీబీవీలో సీటు ఇప్పించే బాధ్యత నాది.' అని రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈనెల 20వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'సీటు రాక.. చదువు సాగక..!' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈవార్తకు మంత్రి స్పందించి వెంటనే కేజీబీవీ ఎస్‌పీడీ శ్రీనివాసరావు, డైరెక్టర్ దేవానందరెడ్డి, కలెక్టర్ సిరి, డీఈవో శామ్యూల్‌పాల్‌కు జెస్సీని కేజీబీవీలో చేర్చాలని ఆదేశాలు జారీచేశారు. ఆదివారం చిలకలడోన కస్తూర్బా పాఠశాలలో అధికారులు చేర్పించారు. తమ కూతురుకు సీటు రావడం ఆనందంగా ఉందని తల్లిదండ్రులు మీనుగకుమార్, సంతోషమ్మ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి'కి రుణపడి ఉంటామన్నారు. పాఠశాలకు వచ్చిన డీఈవో స్వయంగా దరఖాస్తు ఫారాన్ని నింపి అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ శాంతికి అందజేశారు. నీకు సీటు రావడానికి మంత్రి లోకేశ్, ఎంతో మంది అధికారులు, నాయకుల కృషి ఉందని, ఉన్నతంగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని డీఈవో పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'ని ఆయన అభినందించారు. ఇలాంటి కథనాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందన్నారు. టీడీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి, ఎంఈవో రాగన్న, రామకృష్ణ వేణి, బూదూరు పాఠశాల హెచ్ఎం రంగనాథ్, భూషణం, సీఆర్‌పీలు బీమేష్, బంగారప్ప, క్లస్టర్ ఛైర్మన్ లచ్చప్ప పాల్గొన్నారు.

## గిరి బలిజ నుంచి 'బలిజ' పదం తొలగించాలి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న బలిజ సంఘం నాయకులు

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం దొమ్మెరల సామాజిక వర్గ పేరును 'గిరి బలిజ'గా మార్చడాన్ని వ్యతిరేకిస్తూ 'బలిజ' అన్న పదాన్ని తొలగించాలని బలిజ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీవోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ఎంఎస్ నెం.5 బలిజల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాపునాడు అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, విజయభాస్కర్, రామస్వామి, డాక్టర్ కుళ్లాయప్ప, భాస్కర్ బాబు, కప్పట్రాళ్ల మోహన్, బాలరాజు, జనసేన పార్టీ నాయకుడు చింతా సురేష్‌బాబు, మండ్లెం రవికుమార్, నాయకులు ఈశ్వర్‌కుమార్, శైలేష్, అమర్నాథ్, శేషు, సుజాత పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**నంద్యాల నూనెపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** క్రిష్ణమ్మకోన పాణ్యం రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. సుమారు 30నుంచి 40ఏళ్ల మధ్య పురుషుడిగా పేర్కొన్నారు. నల్లటి టీషర్టు మృతదేహం సమీపంలో ఉంది. ముదురు ఆకుపచ్చ రంగుగల నైట్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. చేతికి నందిని, ఉష అంటూ పచ్చబొట్టు ఉందని, ఎలాంటి ఆధారాలు లభించలేదని, సమాచారం కోసం నంద్యాల రైల్వే పోలీసుల సంప్రదించాలన్నారు.





## 'సిద్ధార్థరెడ్డి ఒక యూట్యూబ్ స్టార్'

**కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి యూత్‌స్టార్ కాదు, యూట్యూబ్ స్టార్ అని జనసేన సమన్వయకర్త చింతా సురేష్ అన్నారు. ఈమేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై పిచ్చి వాగుడు వాగితే జనసైనికులు అంతకు మించి మాట్లాడతారని హెచ్చరించారు. సీనియర్ నాయకుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి సైతం బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి మద్దతు పలకటం హాస్యాస్పదమని విమర్శించారు.

## గిడ్డంగులను వినియోగంలోకి తేవాలి

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉల్లి రైతుల కోసం కోడుమూరు, గూడూరు, డోన్‌లో రూ.5కోట్లతో నిర్మించిన శీతల గిడ్డంగులను ఉపయోగంలోకి తీసుకురావాలని రైతు సంఘం జిల్లా


మాట్లాడుతున్న జి.రామక్రిష్ణ

కార్యదర్శి జి.రామ క్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం కేకే భవన్‌లో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్మించినా అవి ప్రస్తుతం నిరుపయోగా ఉన్నాయన్నారు. వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తే రైతులు ధర వచ్చేవరకు ఉల్లిగడ్డలను నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుం దన్నారు. మార్కెట్ మాయాజాలాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సహాయకార్యదర్శి కోటకొండ సూరి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

● ఉల్లి రైతులకు సీఎం చంద్రబాబు మరింత సాయం అందించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బలరాం ప్రకటనలో డిమాండ్ చేశారు.

## వర్క్‌షాపును వినియోగించుకోవాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** వర్క్‌షాపును వినియోగించుకోవాలని ఛైర్మన్ కేవీ సుబ్బారెడ్డి సూచించారు. ఆదివారం కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ విభాగాలకు సంబంధించిన అంశాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంత్ కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## బాక్సింగ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ వాసురెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని కొండారెడ్డి బురుజు పార్కులో ఆదివారం బాక్సింగ్ పోటీలను వీఆర్ హాస్పిటల్ అధినేత సి.వాసురెడ్డి పోటీలను ప్రారంభించారు. తల్లిదండ్రులు తమ పిల్లలచే క్రీడలను సాధన చేయించాలని, క్రీడాకారులకు తన సాయం ఉంటుందన్నారు. జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు మాట్లాడుతూ చిన్నతనం నుంచి తమ కిష్టమైన క్రీడను ఎంచుకోవాలన్నారు. బాక్సింగ్ సంఘం కార్యదర్శి తేజ, పీఈటీలు పరుశురాముడు, సుంకన్న, మాస్టర్ కేఎండీ షకీల్, సింగం సురేష్, రంజిత్ కుమార్, గణేష్ పాల్గొన్నారు.

## కవితకు చిరునామా వెంకటకృష్ణ

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రగతిశీల కవిత్వానికి చిరునామా కవి జి.వెంకటకృష్ణ నిలిచారని మార్క్సిస్ట్ మేధావి జి.భార్గవ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కవి 'వెంకటకృష్ణ కవిత్వం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షత్య వహించారు. పుస్తకంలోని లోగొంతుక కవిత్వంపై ఎస్.నాగమణి, దున్నేకొద్దీ దుఃఖంపై మారుతీ పౌరోహితం, కొన్ని రంగులు ఒక పద్యంపై జంధ్యాల రఘుబాబు, చినుకు దీవిపై డాక్టర్ అరుణ, కంచె దాటే పాటపై కొత్తపల్లి సురేష్ విశ్లేషణ చేశారు. అనంతరం కవి వెంకటకృష్ణను సన్మానించారు. అనంతరం లలిత కళా సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ లలిత కళాసమితి అభివృద్ధికి కళారంగం అభివృద్ధికి కళాకారులను ప్రోత్సహించడంలో శేషయ్య ముందుండేవారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం జిల్లా కార్యదర్శి రాజు, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం బాధ్యులు ధనుంజయచ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్, ప్రసాద్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** డీఎస్సీలో మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం కేశవ మెమోరియల్ హై స్కూల్‌లో జిల్లా అధ్యక్షుడు చిన్న నాగస్వామి నాయక్ అధ్యక్షతన డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించారు. ఎన్‌వీఎస్ గుప్త, పి.నాగిరెడ్డి, ఎం.ప్రశాంతిదేవి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి


పెద్దటేకూరులో పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

**కల్లూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** రైతులు సాగుచేసిన ఉల్లి, టమోటా, పత్తి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా సమాయ కార్యదర్శి డి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలోని ఉల్లి, పత్తి పంటలను పరిశీలించారు. ఉల్లి, పత్తి, కంది, టమోటా, పచ్చిమిర్చి సాగు చేసి, గిట్టుబాటు ధరల్లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్లన్న, రాముడు తదితరులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

**సి. బెళగల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి, వాసవిమాత, శివాలయంలో నవరాత్రులకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకుడు బాలజివెంకటేశ్ తెలిపారు. ఆదివారం మాట్లాడుతూ గ్రహాలను ఎర్పాటు చేశామన్నారు. కొరిశెట్టి విశ్వేరుడు, పాండురంగన్న, రాముడు ఉన్నారు.

## హిందూ సమాజ బలోపేతమే లక్ష్యం


**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** హిందూ సమాజాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయి రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని రెవెన్యూ కాలనీ భరత మాత ఆలయంలో భజరంగదళ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.




నగరంలో రూ.వేలు ఖర్చుచేసి ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు కనిపించకుండా పోతున్నాయి. జిల్లా స్థాయి అధికారులు నివాసముండే ప్రభుత్వ అతిథి గృహం వద్ద కుండీల్లో మొక్కలు లేవు. రూ.వేలు ఖర్చు చేసి ఇలా వదిలేయడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. - కర్నూలు న్యూసిటీ.




బ్రాహ్మణదొడ్డి పంచాయతీ మజరా ఎర్రగుంటకొట్టాల గ్రామంలో సీసీ రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో 35 కుటుంబాలున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. క్రిష్ణదొడ్డి, బ్యాదోళ పల్దొదొడ్డి గ్రామాల్లోనూ ఇంతే. - సి.బెళగల్




మండలంలోని కన్నమడకల, సోమయాజులపల్లె, కాల్వ చెన్నంచెట్టిపల్లె గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను చూస్తేనే జనం హడలిపోతున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో పెచ్చులు ఊడి కడ్డీలు తేలాయి. సోమయాజుల పల్లె గ్రామంలోనిది ఈ చిత్రం - ఓర్వకల్లు.

## శ్వాసకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స

● కర్నూలులో రీజనల్ పల్మనాలజీ సదస్సు


రీజనల్ పల్మనాలజీ సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

**కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** శ్వాసకోశ వ్యాధులకు ఆధునికి చికిత్స అందుబాటులో ఉందని హైటెక్ సిటీ యశోధ హాస్పిటల్స్ క్లినికల్ అండ్ ఇంటర్వేన్షనల్ పల్మనాలజిస్టు డా.వెంకట నాగార్జున మాటూరు అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో రాయలసీమ రీజనల్ పల్మనాలజీ అప్‌డేట్-2025 వైద్యుల సదస్సు నిర్వహించారు. జీవనశైలి మార్పు, కాలుష్యం, వైరల్ ఇన్‌ఫెక్షన్లతో ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు పెరిగి మరణాలకు కారణమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సింగిల్ ఇన్‌హేలర్లు, ట్రిపుల్ థెరపీ, బయోలాడ్స్ రాకతో ఆస్తమా, సీవోపీడీ చికిత్సలు విప్లవాత్మకంగా మారాయన్నారు. కోవిడ్ అనంతరం పల్మనాలజిలో క్రిటికల్ కేర్‌లో ఆధునిక చికిత్సలు అందుబాటులో వచ్చాయన్నారు దేశంలో మొదటిసారిగా నావిగేషనల్ బ్రోంకోస్కోపి, కోన్‌బీమ్, సిటీ గైడెడ్, బయాప్సీ, బయోడిగ్రేడబుల్, స్టంట్లు నూతనంగా వచ్చాయన్నారు. వైద్యులు డా.వెంకటరమణ కోలా, కార్పొరేట్ రిలేషన్ జీఎం ప్రదీప్ గౌడు, కర్నూలు చెందిన పల్మనాలజిస్టులు డా.కుళ్లాయప్ప, డా.సి.శ్రీనివాసరెడ్డి, డా.ఎం.శైలజ, డా.నెమలి రవికుమార్ రెడ్డి, డా.సుబ్బారావు, సీనియర్ ఫిజీషియన్, డా.మాలకొండయ్య, డా.ఎస్.ఎన్ ఖాద్రి, కడప అనంతపురం, బళ్లారి, రాయచూరు, మహబూబ్ నగర్, గద్వాల, వనపర్తి, జిల్లా నగర్ కర్నూలు జిల్లాల నుంచి పల్మనాలజిస్టులు పాల్గొన్నారు.

## రహదారులను బాగుచేయండి


19వ వార్డులో రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

**కల్లూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** కాలనీల్లో రహదారులను బాగు చేయాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం 19వ వార్డు ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో ప్రతినిధుల బృందంతో పర్యటించారు. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని ప్రజలు నడవడానికి వాహనలు నడిపేందుకు కూడా వీలు కావడం లేదని విమర్శించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూసూఫ్, ఎల్లకృష్ణ, నయూం, రాముడు, ఖలీల్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల సైకిల్ ర్యాలీ

**సి. బెళగల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** పోలీసులంటే ప్రజలకు మిత్ర భావం ఉండాలని ఎస్‌ఐ పరమేష్‌నాయక్ అన్నారు. ఆదివారం సి.బెళగల్‌లో పోలీసు స్టేషన్ నుంచి పాత బస్టాండు వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు సైకిల్ ర్యాలీ నిర్వహించామని, సమస్యలుంటే నేరుగా స్టేషన్‌కు రావాలన్నారు. క్షణికావేశాలకు లోనుకాకుండ సోదబావంతో కలిసిమెలసి ఉండాలని సూచించారు. ఏఎస్‌ఐ నాగయ్య, హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప, ఆచారి, శ్రీరాములు, సుదర్శనం, సుజాత ఉన్నారు.

## 23వ వార్డులో సమస్యలను పరిష్కరించాలి

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** నగర పాలక పరిధిలోని 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నగర కార్యదర్శివర్గసభుడు ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం వార్డులో సంతకాల సేకరణ చేశామన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలు ఉన్నాయని, తక్షణమే పరిష్కరించాలన్నారు. ఆర్.శేషంరాజు, బి.ప్రసాద్, సలాంబాషా తదితరులు పాల్గొన్నారు.

## మహిళల హక్కుల కోసం పోరు

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** మహిళల హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల అన్నారు. ఆదివారం నగరంలోని జీబీ ఫంక్షన్ హాలులో రషీదా అధ్యక్షతన ఐద్వా మూడో నగర మహసభ నిర్వహించారు. మహిళలంటే వంట గదికి పరిమితం కారని, యాక్టర్, డాక్టర్,


మాట్లాడుతున్న నిర్మల

కలెక్టర్, పైలట్‌గా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రషీదా దేశాయ్, బంగి పద్మతో పాటు 20 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి అలివేలు, మంగమ్మ, ఖమ్రున్‌బీ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

● పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


విగ్రహాలకు టోకెన్లు తీసుకున్న మంటపాల ప్రతినిధులు

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** నగరంతో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆదివారం టీజీవీ గ్రూప్ సంస్థల తరఫున 45 దుర్గామాత విగ్రహాలను పంపిణీ చేశారు. విగ్రహాలకు సంబంధించిన టోకెన్లను మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వాహకులకు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ విగ్రహాల విలువ రూ.7 లక్షలు ఉంటుంద, టీజీవీ సంస్థల తరఫున కర్నూలులో తమ సేవా కార్యక్రమాలుకొనసాగుతాయన్నారు.

## నేడు ఫిర్యాదుల స్వీకరణ

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని ఎస్‌బీఐ కాలనీ నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలని, నిర్దేశిత గడువులోపు పరిష్కారం లభిస్తుందని అర్జీల వివరాలను https://meekosam.ap.gov.in లో చూడవచ్చని వివరించారు.

## పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయ, అధ్యాపకులనుంచి ఉత్తమ సేవకు పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, అసోసియేషన్ ఆఫ్ అలియన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్‌జోన్స్, నైస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అక్టోబరు 5న అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేస్తామన్నారు. ఈనెల 24లోగా వివరాలు, ఫోటోగ్రాఫ్, ప్రెస్ క్లిప్పింగులతో నగరంలోని వెంకటరమణకాలనీ నైస్ కంప్యూటర్స్‌లో అందజేయాలని కోరారు. వివరాలకు సెల్ నెం. 93968 61308లో సంప్రదించాలని సూచించారు.

## రాష్ట్రస్థాయికి ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** గురుకుల్ పాఠశాల విద్యార్థిని బి.హేమశ్రీ ట్రయాథెనిక్ (అథ్లెటిక్)లో జిల్లా స్థాయికి ఎంపికైంది. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 ప్రతిభ చూపడంతో ఈ నెల 27, 29 తేదీల్లో తూర్పు గోదావరి ఏలూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ పి.విష్ణుప్రియ తెలిపారు.

## నేడు కర్నూలుకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం కర్నూలుకు రానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మార్కెట్ యార్డులో ఉల్లి రైతులతో మాట్లాడతారని, అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు పత్తికొండ టమోటా మార్కెట్ సందర్శిస్తారని తెలిపారు. 2.30 గంటలకు ఆదోనిలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కాలేజీ సందర్శిస్తారని ఆయన పేర్కొన్నారు.


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

## సత్ప్రవర్తనతో మెలగాలి

● నగరంలోని పోలీస్ స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**కర్నూలు క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు అధికారులు హెచ్చరించారు. ఆదివారం నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌనెల్సింగ్ ఇచ్చారు. నాలుగో పోలీస్ స్టేషన్ పరిధిలో 50 మంది, వన్‌టౌన్ పరిధిలో 13 మందికి, తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో 22 మందికి త్రీటౌన్ పరిధిలో 20 మందికి, టూటౌన్ పరిధిలో 25 మందికి సీఐలు, ఎస్‌ఐలు కౌన్సెలింగ్ ఇచ్చారు.

## శేషయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ.గఫూర్


మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

**కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** సీపీఎం సీనియర్ నాయకుడు జేఎస్.శేషయ్య ఆశయ సాదనకు కృషి చేఆలని ఆ పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు ఎంఏ.గఫూర్ పేర్కొన్నారు. ఈ నెల 8న మృతిచెందిన శేషయ్య సంస్మరణ సభ ఆదివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేశారు. 40 సంత్సరాలుగా పార్టీలో చుకుకైన పాత్ర నిర్వహించారన్నారు. ఎస్టేట్ కార్మికులందరనీ సీఐటీయూ కిందకు తీసుకువచ్చారని కొనియాడారు.

## సారా నిర్మూలనే లక్ష్యం : ఎక్సైజ్ సీఐ


బంగారుపేటలో ఎక్సైజ్ పికెటింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎక్సైజ్ అధికారులు

● బంగారుపేటలో పహారా

**కర్నూలు అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** సారా నిర్మూలనే లక్ష్యమని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఆదివారం నగంరలోని బంగారుపేటలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పికెటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. బాధితులకు సారావిముక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సారా విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకునే ఉద్దేశ్యంతో బంగారుపేట నిఘా ఉంచామన్నారు. సారా రహిత బంగారుపేట లక్ష్యమని తెలిపారు. సారా తయారీ, విక్రయమ మానితే ఉపాధి చూపుతామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రెహనబేగం, పోలీసులు పాల్గొన్నారు.

## అమావాస్య పూజలు

**ఓర్వకల్లు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో ఆదివారం అమావాస్య పూజలు నిర్వహించారు. పోటెత్తారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు అదిక సంఖ్యలో హాజరై స్వామివారికి ఆకుపూజ, కుంకుమార్చన పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమా లను ప్రదర్శించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

## ఆధునిక సాహిత్యానికి గురజాడ సేవలు


నివాళి అర్పిస్తున్న పత్తి ఓబులయ్య, కళాకారులు

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ వేంకట అప్పారావు సేవలు చిరస్మరణీయమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గురజాడ 173వ జయంతి నిర్వహించారు. దేశభక్తి గీతాలు, గేయాలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారని, దిద్దుబాటు అనే నాటకతో ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేశారని గుర్తు చేశారు. సాంఘిక దురాచారంపై కన్యాశుల్కంపై నాటకం రాసి సంచలనం సృష్టించానానరు. కార్యదర్శి సి. యాగంటీశ్వరప్ప, సభ్యులు పీపీ గురుమూర్తి, కేవీ రమణ, సంగా ఆంజనేయులు, జీవీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'శ్రేయస్కర సమాజ నిర్మాణమే లక్ష్యం'


మాట్లాడుతున్న అక్బర్‌బాషా

**కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** శ్రేయస్కర సమాజ నిర్మాణమే జమాత్-ఎ-ఇస్లామిక్ హింద్ లక్ష్యమని ఆ సంస్థ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ అక్బర్‌బాషా అన్నారు. ఆదివారం కార్యాలయంలో జమాత్-ఎ-ఇస్లామిక్ హింద్ మీడియా ఓరియంటేషన్ నిర్వహించారు. 78 ఏళ్లుగా నైతిక విలువల కోసం కృషి చేస్తోందన్నారు. దేశంలో 25 కోట్ల మంది ముస్లింలు ఉన్నారన్నారని, భావోద్వేగాలు, సమస్యలను విస్మరించడం దేశానికి నష్టమన్నారు. సయ్యద్ ఇబ్రహీం షరీఫ్, చాంద్‌బాషా, రహీం పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సంక్షేమానికి కృషి


శ్రీనివాసరావును సన్మానిస్తున్ననాయకులు

**కల్లూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** బ్రాహ్మణ సంక్షేమానికి కృషిస్తానని బ్రాహ్మణ వేల్ఫేర్ కార్పోరేషన్ డైరెక్టర్ ఎస్‌కే.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం నగరం బ్రాహ్మణ సంఘం, గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్‌గా ఎంపికైన శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. తనకు అవకాశమిచ్చిన సీఎం చంద్రబాబు, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డికి దన్యవాదాలు తెలిపారు. కల్యాకర చంద్రశేఖర్, పిఎస్.రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# లోపించిన పారిశుధ్యం

- పెరుగుతున్న దోమల సంతతి
- శివారు ప్రాంతాల్లో మరింత అధ్వానం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


అగ్నిమాపక కార్యాలయం పక్కన ఉన్న మురుగు కుంట

**ఆలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు నివాసిత ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు దోమలకు నివాసాలయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీటిలో వ్యర్థాల కలిసి దోమలకు ప్రీతికరమైన ప్రాంతాలుగా మారాయి. వాటి సంతతిని విపరీతంగా వృద్ధి చేసుకుంటున్నాయి. అధికారులు, ఆరోగ్య సిబ్బంది గమనిస్తున్నా శుభ్రంచేసే పనితమది కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా స్థలాల్లో పుడుతున్న దోమ వంటింట్లోకి వచ్చి కుడుతోంది. జ్వరాలబారిన పడేట్లు చేస్తోంది. ఆసుపత్రులు, వైద్యుల చుట్టూ తిపతోంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పటికీ నివాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో చేరిన మురుగు నీటిలో పెరిగిన దోమకాటుకు జ్వరాల బారిన పడక తప్పడంలేదు. దీంతో జ్వరాల బాధితులు పెరిగిపోతున్నారు. కొన్నివీధుల్లో కొందరు స్థలాలను ఖాళీగా ఉంచేస్తున్నారు. ఎపుడో నిర్మించుకున్న ఆవాసాల మధ్యన కూడా ఖాళీ స్థలాలు ఉంటున్నాయి. శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించిన యజమానులు వాటి స్థానంలో నిర్మాణాలు చేపట్టకపోవడంతో రానురాను గుంతలుగా తయారవుతున్నాయి. ఈ ఖాళీ స్థలాల్లో చెత్తా, చెదారాన్ని పడేస్తున్నారు. ఇళ్లల్లో వాడేసిన నీటిని ఇట్టే మళ్లిస్తున్నారు. ఆలూరులోని ఫైర్ స్టేషన్ పక్కన ఉన్న సహాయ సాంఘిక సంక్షేమ కార్యాలయం పాత భవనం మొత్తం మురుగు కుంటగా మారిపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరంతా బయటకు పోకుండా అక్కడే ఉండిపోతోంది. చెట్ల నుంచి పడిన ఆకులు అందులో కుళ్లి దోమల పుట్టుకకు అనుకూలంగా మారింది. మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలో పూర్తిగా పూర్తిగా దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల పాలవుతున్నారు.

**ఇవీ జాగ్రత్తలు**

- ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- బక్కెట్లు, డ్రమ్ములు ఖాళీ చేసి శుభ్రంగా ఉంచాలి.
- కూలర్లలో నీటిని నిల్వ ఉంచొద్దు
- ఫ్రిజ్ వెనకభాగంలో చేరే నీటిని ఎప్పటికపుడు పారబోయాలి
- నిద్ర సమయంలో దోమ తెరలువాడాలి.
- దుస్తులతో శరీరాన్ని పూర్తిగా కప్పుకోవాలి.
- ఇంటి ద్వారాలకు, కిటికీలకు నెట్లు వాడాలి.
- సాయంత్రం 6 గంటల నుంచి తలుపులు మూసేయాలి.
- బంతి, తులసి, కలబంద మొక్కల పెంపకంతో ఇళ్లలోకి దోమలు రాకుండా కొంతవరకు నివారించవచ్చని ప్రకృతి వైద్యులు చెబుతున్నారు.

ఈ యేడాది వర్షాలు ఎక్కువగానే కురుస్తున్నాయి. సెప్టెంబర్ నెలంతా వానలు పడతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ వర్షాలకు ఖాళీ స్థలాల్లో చేరిన నీరు మురుగుగా మారుతోంది. ఆ నీటి నిల్వల్లో దోమల ఉత్పత్తి పెరుగుతోంది. మొదట గుడ్లు పెడతాయి. లార్వా ప్యూపా దశల్లో వారం, పది రోజులు పెరిగాక బయటకు వచ్చి మనుషులను కుడుతున్నాయి.


ఎంపీడీవో కార్యాలయం
ఎదురుగా ఖాళీ స్థలంలో చేరిన మురుగు

**జాగ్రత్తలు తీసుకోవాలి**



వాతావరణంలో మార్పులు, కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అత్యధికంగా జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమ తెరలు వాడాలి, వేడి చేసిన నీటిని తాగాలి. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

● రామకృష్ణ, ప్రభుత్వ వైద్యుడు, ఆలూరు

## ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం


మాట్లాడుతున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై వైఎస్సార్సీపీ నాయకులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమని పత్తికొండ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన పత్తికొండలో విలేకరులతో మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్‌పై వెటకారంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. అలాగే పవన్‌కళ్యాణ్ తండ్రి ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేయడంతో, ఆ సందర్భంలో పవన్‌కళ్యాణ్ కూడా చదువులు ఆయా ప్రాంతాల్లో చదివారని, ఈ విషయం పవన్‌కళ్యాణ్ పలు సందర్భాల్లో మాట్లాడారని, ఈ మాటలపై బైరెడ్డి సిద్ధార్థరెడ్డి నోరు పారేసుకోవడం ఎంతవరకు సబబు అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఐటీ వింగ్ కో ఆర్డినేటర్ పురుషోత్తం, జనసైనికులు తిమ్మప్ప, వీరేష్ పాల్గొన్నారు.

## ఆదోని జిల్లా సాధన కోసం ఉద్యమం



మాట్లాడుతున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి

**ఆదోని, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఆదోని జిల్లా ఏర్పాటు చేసి కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య పేరు పెట్టాలని మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్ జైన్, రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి, రంగన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా సాధన కోసం జేఏసీ ఏర్పాచేసి పార్టీలకు అతీతంగా కుల సంఘాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు ఏకతాటిపై వచ్చి ఉద్యమించాల్సిన అవసరం ఉందని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆలూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్య క్షులు శ్రీనివాసులు, సీపీఐ నాయకుడు భూపేష్, అభ్యుదయ దళిత సేవా సంఘం కార్యదర్శి కల్లుపోతుల రంగన్నతో పాటు కుల, విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

## పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలి

**ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టిన 10 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్ బాబు, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు పీఎస్ గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మిక సంఘ నాయకులు సమావేశం జరిగింది. ఈసందర్భంగా రాష్ట్రంలోని కార్మికులు కూటమిని అధికారంలోకి తీసుకొస్తే 8గంటల పని విధానాన్ని రద్దు చేసి 10గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు వెంకన్న, ఓబీ నాగరాజు, తిప్పన్న , ఎంకప్ప పాల్గొన్నారు.

## 24న సీడీపీవోపై విచారణ

**ఆలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఆలూరు సీడీపీవో నరసమ్మపై కురువల్లి అంగన్‌వాడీ వర్కర్ భువనేశ్వరి చేసిన అవినీతి, ఆరోపణలు పత్రికల్లో వచ్చిన కథనాలపై ఈనెల 24న విచారణకు హాజరుకావాలని సీడీపీవో నరసమ్మకు, వర్కర్ భువనేశ్వరికి జిల్లా ఐసీడీఎస్ పీడీ విజయ నోటీసులు జారీ చేశారు. సీడీపీఓ అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరిని వేధించిందని, అద్దె చెల్లింపులో పర్సెంటేజీలు చెల్లించాలని, సూపర్‌వైజర్, వర్కర్ ద్వారా డిమాండ్ చేసిందని అధికారులకు కూడా ఫిర్యాదు చేసింది. విచారణలో ఐసీడీఎస్ ప్రాజెక్టులో సీడీపీఓపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరగనుంది. ఆలూరు మండలానికి చెందిన అందరూ అంగన్‌వాడీ కార్యకర్తలు అన్ని రిజిస్టర్‌లతో హాజరుకావాలని ఆదేశించారు.

## మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే నిర్వహించాలి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**ఆదోని రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించాలనిసీపీఐ నాయకులు అజయ్ బాబు, వీరేష్ డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, విద్యార్థి సంఘాలు ఆందోళన చేపడితే వారిపై కేసులు పెడుతారా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ విధానాన్ని వామపక్షాలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నాయని, కావున తక్షణమే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జైళ్లకు వెళ్లడానికైనా సిద్ధమేనని తేల్చిచెప్పారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో పత్తికొండ విద్యార్థికి బంగారు పతకం


బంగారు పతకం అందుకుంటున్న అఫ్రిది

**పత్తికొండ టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** గుంటూరు నగరంలో ఆదివారం నిర్వహించిన అండర్-14 బాలుర వెయిట్ లిఫ్టింగ్ విభాగం పోటీల్లో పత్తికొండ పట్టణానికి చెందిన అఫ్రిది మొదటి విజేతగా నిలిచి బంగారు పతకాన్ని అందుకున్నాడు. వివరాల మేరకు.... పత్తికొండ పట్టణానికి చెందిన ఖలీల్, మాధవి దంపతుల కుమారుడైన అఫ్రిది కర్నూలు నగరంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు గుంటూరులో పాల్గొని 79 కేజీల విభాగంలో సత్తా చాటాడు. అందుకుగానూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ అఫ్రిదికి బంగారు పతకాన్ని, సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. పత్తికొండ ప్రాంతానికి ప్రజలు, కుటుంబ సభ్యులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేశారు.

## నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు


పూజలందుకుంటున్న సుంకులా పరమేశ్వరి

**తుగ్గలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలో సుంకులా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమావాస్య పురస్కరించుకుని సుంకులా పరమేశ్వరి దేవిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. సోమవారం నుంచి దసరా వరకు అమ్మవారిని పలు రూపాల్లో అమ్మవారిని అలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి పూజలు చేస్తారన్నారు. ప్రజలు పాల్గొని దసరా ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.


పూజలందుకుంటున్న పార్వతీదేవి

**మద్దికెర :** మండల పరిధిలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథ స్వామి దేవాలయంలో, నగరేశ్వరస్వామి దేవాలయంలో నేటి నుంచి దేవీ దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో పూజలు


పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి

**మద్దికెర, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :** మండల కేంద్రంలోని మద్దమ్మకుంట గ్రామ సమీపాన వెలసిన శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో వైభవంగా పూజలు చేశారు. ఆదివారం పౌర్ణమి పర్వదినం కావడంతో మూలవిరాట్ సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వహకులు విజయప్రసాద్ యాదవ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## 'రైతుల భూములు లాక్కోవడం తగదు'

**ఆలూరు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** పవర్‌గ్రిడ్ సోలార్ పేరుతో సారవంతమైన భూములను లాక్కోవడం తగదని రైతుల పక్షాన నిలబడి భూసేకరణను అడ్డుకుంటామని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జ్యోతిబసు భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సమస్యలపై ఈనెల 24న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, ఈరన్న, వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, కృష్ణ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపును వినియోగించుకోండి

**వెల్దుర్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సూపరిండెంట్ బాలచంద్రారెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆరోగ్యవంతమైన మహిళ- శక్తివంతమైన కుటుంబం' పథకం కింద మహిళలకు ఉచితంగా కంటి, రక్తపోటు, ఈఎన్‌టీ, మధుమేహం, దంతపరీక్షలు, నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనతస్థాయి, క్షయ, సికిల్‌సెల్ వైద్యపరీక్షలు, ఆరోగ్యసేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఉన్న మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## పాండవగల్లులో శ్రమదానం

**ఆదోని రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) :** ఆదోని మండలం పాండవగల్లులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నాయకులు శ్రమదానం చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు కూడ తమ నివాస పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరేష్, వీరాంజి, తదితరులు పాల్గొన్నారు.

## 25న గుంటూరులో భారీ బహిరంగ సభ


పోస్టర్ విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

**ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :** ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై ఈనెల 25న గుంటూరులో యూటీఎఫ్ నిర్వహించే భారీ బహిరంగ సభకు ఉపాధ్యాయులంతా కదలి రావాలని యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు రాజ్‌కుమార్ కోరారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. యూటీఎఫ్ బహిరంగ సభ పోస్టర్లను సీనియర్ నాయకులు ఫయాజుద్దీన్, నూర్ భాషా విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున. జగన్మోహన్, నగేష్, సాదిక్, బాలచంద్రుడు, సుశీలమ్మ, సులోచనమ్మ, ఇందిరా ప్రియాంక, సుజాత, రాజేశ్వరి, రోజా మేరీ పాల్గొన్నారు.

# ఉల్లి రైతులకు అండగా ప్రభుత్వం


ఆలూరులో చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, రైతులు


ఆదోనిలో ఉల్లి రైతుతో మాట్లాడుతున్నఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, భూపాల్ చౌదరి టీడీపీ నాయకులు

**ఆలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఉల్లి రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదుకునేందుకు ఒక హెక్టారుకు రూ.50 వేలు నష్టపరిహారం ప్రకటించడం హర్షణీయమని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు రైతులో కలిసి పాలాభిషేకం చేశారు. ఏబీసీ డీసీ చైర్మన్ నగరడోణ కిష్టప్ప, మండల కన్వీనర్ అశోక్, టీడీపీ నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజనేయులు, ముద్దరంగ, మసాల జగన్, మల్లికార్జున, గూళ్యం రామాంజినేయులు, కొమ్ము రాజు, రమేష్, వన్నూరువలి, కిట్టు, గుండన్న పాల్గొన్నారు.

**ఆదోని:** రైతుల కన్నీళ్లను తుడవడంలో సీఎం ముందుండి చర్యలు తీసుకుంటున్నారని ఏపీ కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్‌చౌదరి పేర్కొన్నారు. శనివారం టీడీపీ, జనసేన నేతలు ఆదోని మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. యువ నేతలు మారుతినాయుడు, వెంకటేష్, రామస్వామి, శివప్ప, ఆదోని పట్టణాధ్యక్షుడు తిమ్మప్ప, జనసేన మండలాధ్యక్షుడు తాహేర్‌వలి, వేణువర్మ, సాధికాబేగం పాల్గొన్నారు.

**దేవనకొండ :** సీఎం చంద్రబాబుతోనే ఉల్లి రైతాంగాన్నికి న్యాయం జరిగిందని టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, వీరేష్ అన్నారు. స్థానిక గ్రామపంచాయతి కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మలకన్న, మస్తాన్, తిమ్మయ్య, గోవిందు, రామాంజినేయులు, టీవి రామాంజినీ, పాల్గొన్నారు.


పత్తికొండలో..

**వెల్దుర్తి:** మండలంలో గుంటుపల్లి గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఈదుల వెంకటరాముడు రైతులతో కలిసి ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, వెంకటేశం, శేషన్న, రాముడు, రామాంజనేయులు, రాజశేఖర్ రైతులు పాల్గొన్నారు.

**తుగ్గలి:** పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ తాలుకా తెలుగు రైతు సంఘం అధ్యక్షులు బాలన్న, టీడీపీ తెలుగు యువత నాయకులు మిద్దె వెంకటేశ్, మిద్దె రవికుమార్ అన్నారు. రైతులను మభ్యపెట్టి కూటమి ప్రభుత్వంపై బురదజల్లడం పనే వైసీపీ నాయకులు ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. వారిని ఎవరూ నమ్మరన్నారు.

**మద్దికెర :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తూరైతు పక్షపాతిగా నిలిచారనిమండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గడ్డం రామాంజులు అన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు సాగు చేసిన ఉల్లి పంట దెబ్బతినడంతో హెక్టారుకు రూ.50వేలు పరిహారం ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశంలో గొడుగు సతీష్, మీసేవా భీమరాజు, గుడి ఎల్లప్ప, టీడీపీ నాయకులు గుడి ఎల్లప్ప పాల్గొన్నారు.

**పత్తికొండ:** ఉల్లిరైతులన ఆదుకునేందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హెక్టారుకు రూ. 50వేలు పరిహారం ప్రకటించడాన్ని హర్షిస్తూ పత్తికొండలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పాలాబిషేకం చేశారు. మండల కన్వీనర్ కడవల సుధాకర్, బీటీగోవిందు, శ్రీనివాసుల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


దేవనకొండలో..


వెల్దుర్తిలో..

## ఉప్పొంగిన చిన్నహుల్తి వంక


ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్నహుల్తి వంక

**మద్దికెర సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలోని బురుజుల గ్రామ శివారులో మళ్లీ చిన్నహుల్తి వంక ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పైతట్టు ప్రాంతాల్లోనై నల్లరేగడి పొలాల్లో కురిసిన భారీ వర్షాలకు బురుజుల చిన్నహుల్తి వంక పెద్ద ఎత్తున్న ప్రవహిస్తుండటంతో మద్దికెర నుంచి వయా బురుజుల మీదుగా పత్తికొండకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ద్విచక్రవాహనదారులు అందరూ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ ప్రాంతాల్లో కల్వర్టులు నియంత్రించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు కరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు.

## బుక్ కీపర్‌పై విచారణ

**దేవనకొండ, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి):** పొదుపు మహిళల నిధులను కాజేసిన పి.కోటకొండ వీవోఏ మిన్నెల హుసేన్ (వలి) అవినీతిపై శనివారం రాత్రి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) ఏ.అబ్దుల్ రహిమాన్ గ్రామానికి చేరుకొని విచారణ చేశారు. అధికారి కోసం ఉదయం నుండి గ్రామస్తులు వేచ్చి చుడగా, రాత్రి ఎనిమిది గంటలకు గ్రామానికి చేరుకోని నాలుగు సంఘాల సభ్యులతో స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద విచారణ చేశారు. ఎనిమిది పొదుపు సంఘాలు సభ్యులు ఫిర్యాదు చేస్తే, నాలుగు సంఘాలతోనే అధికారులు విచారణ చేయడంతో పి.కోటకొండ గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బుక్‌కీపర్ వైసీపీ ప్రభుత్వంలో కుడా అవినీతిపై ఫిర్యాదులు వస్తే వైసీపీ నాయకుల అండతో అవినీతిని కప్పిపుచ్చడం జరిగిందని అధికారి దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు.

## కల్వర్టుకు మరమ్మతులు చేయాలి


గిరిగిట్ల వద్ద దెబ్బతిన్న కల్వర్టు

**తుగ్గలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** అధిక వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోవడంతో తాత్కాళికంగా మట్టి వేశారు. అయితే రెండు రోజులుగా కురిస్తున్న ఎడతెరపి లేని వర్షాలకు ఆ మట్టి కూడా కొట్టుకుపోతుండటంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గిరిగిట్ల, అమీనాబాదు గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆ మట్టి కూడా వర్షాలకు కొట్టుకుపోవడంతో అటువైపు దాదాపు 30 గ్రామాల ప్రజలు రాత్రివేళలో జొన్నగిరి, ఎద్దులదొడ్డి గ్రామాల మీదుగా అదనంగా 20కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కల్వర్టును మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

**ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :** అభ్యుదయ కవిత పితామహుడు మహాకవి గురజాడ అప్పారావు, 163వ జయంతి వేడుకలు ఆదివారం అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ హైస్కూల్ లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి అరసం జిల్లా అధ్యక్షుడు కలం ప్రహ్లాద పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రామాంజి, ఎస్‌టీయూ నాయకులు ప్రసాద్, వీరచంద్ర యాదవ్, పార్థసారథి పాల్గొన్నారు.

## మహిళపై దాడి

● ముగ్గురిపై కేసు నమోదు

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన గర్జి పూజపై భర్త గర్జి సురేష్, బావ రవి, తోడి కోడలు సుప్రియ దాడి చేశారు. బాధితురాలు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తెలిపారు. పూజ సొంత గ్రామం సూగూరు. అదేగ్రామానికి చెందిన సురేష్‌కు ఇచ్చి ఐదేళ్ల క్రితం ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. భర్త సురేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ నిత్యం వేధింపులకు గురి చేసేవాడు. శనివారం చిన్న కొడుకుకు జ్వరం రావడంతో ఆసుపత్రికి వెళ్దామని భర్తతో చెప్పింది. ఈ విషయంపై భార్యాభర్తలు గొడవ పడుతుండగా.. బావ రవి, సుప్రియ కలుగజేసుకొని దాడిచేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. ఆదివారం మంత్రాలయం పూజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ఎస్ఎంఎస్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఫరిదా రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శోభారాణి తెలిపారు.


విద్యార్థిని ఫరిదాతో పీఈటీలు

పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఫరిదా ఇటీవల ఎమ్మిగనూరు పట్టణంలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్ 19 ఫుట్‌బాల్‌లో జిల్లాస్థాయిలో ఆడి ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23, 24, 25 తేదీల్లో ఎమ్మి గనూరులో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక కావటానికి పీఈటీలు వెంకటేష్, బసవరాజు, సృజనాకుమారి కృషి అభినందనీయమని తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఫరిదాను అభినందించారు.

# అన్నదాతకు అపార నష్టం

● అధిక వర్షాలకు కుదేలవుతున్న రైతులు
● కోసిగిని కరువు మండలంగా ప్రకటించాలి


సాతనూరులో రోడ్డుపై వేసిన ఉల్లిగడ్డలు


కోసిగిలో అధిక వర్షానికి ఎర్రతెగులు సోకిన పత్తి పంట

**కోసిగి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** ఎడతెరిపి లేని అధిక వర్షాలకు మండల రైతులు కుదేలవుతున్నారు. చేతికొచ్చిన పంట కళ్ల ముందే నేలవాలుతుంటే అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు కనీసం పెట్టుబడి లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండలంలో 33వేల ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఉల్లి, పత్తి, వేరుశనగ, బొప్పాయి, ఆముదం, సజ్జ, జొన్న, కొర్ర పంటలు సాగు చేశారు. ఈ ఏడాది వర్షాలు బాగా వచ్చినా అధిక వర్షాల దాటికి పత్తి, ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో 1250 ఎకరాల్లో రైతులు ఉల్లి పంట సాగు చేశారు. అధిక వర్షానికి ఉల్లి రైతు తీవ్రంగా నష్టపోయారు.

పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే ఉల్లి పంటను పారబోశారు. మరికొందరు రైతులు చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్లి కనీసం చార్జీలకు కూడా రాకుండా అక్కడే వదిలేసి వచ్చారు. మరికొందరు రైతులు రోడ్లపైనే పంటను పారబోశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి రైతులు నష్టాన్ని చవి చూశారు.

అలాగే 23,500 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. చేతికి వచ్చే సమయంలో వరుణదేవుడు దాటికి ఎర్రతెగులు సోకి పంట పూర్తిగా దెబ్బతింది. అలాగే వేరుశనగ పంటను 2100 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగకు కూడా అధిక వర్షందాటికి భూమిలోనే పంటకు మొలకలు ఎత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోసిగి మండలాన్ని కరువు మండలంలగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

### ఉల్లి పంట వేసి నష్టపోయాను..



రెండెకరాల పొలంలో ఉల్లి పంటను సాగు చేశా. అధిక వర్షాల ధాటికి పంట అంతంత మాత్రమే వచ్చింది. వచ్చిన పంటకు కూడా గిట్టుబాటు ధర లేదు. ఇప్పటి వరకు ఉల్లి పంట వేసి రూ.2 లక్షలు నష్టపోయా. ప్రభుత్వమే ఆదుకోవాలి. రైతుల పరిస్థితి దారుణంగా ఉంది.

● పింజరి ఖాదర్ బాషా, రైతు, సాతనూరు

### కరువు మండలంగా ప్రకటించాలి



ఏడాది అధిక వర్షాలు దాటికి పత్తి, ఉల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేరుశనగ రైతులు కూడా చాలా దెబ్బతిన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలి. మా కోసిగి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి. మాకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

● బుల్లొల్లి పెద్ద ఈరన్న, రైతు, కోసిగి

### పంట నష్టంపై నివేదికలు సిద్ధం చేస్తాం

మండలంలో నష్టపోయిన రైతులను, పంటలను పరిశీలించి నివేదికలను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. వేరే మండలాల్లో పోల్చుకుంటే కోసిగి మండలంలో ఓమోతాదులోనే వర్షపాతం నమోదైంది. నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేసి జిల్లా అధికారులకు పంపిస్తాం.

● ఎం.వరప్రసాద్, ఏవో, కోసిగి

## 'పది' ఉత్తీర్ణతకు ప్రణాళికలు

● హెచ్‌ఎంల సమావేశంలో డీఈవో శామ్యూల్ పాల్


మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్ పాల్

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా పాఠ్యాంశాలు బోధించాలని డీఈవో శామ్యూల్ పాల్ సూచించారు. ఆదివారం కేజీబీవీలో మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మధ్యాహ్న భోజనం, డ్రాపౌట్లు, బడి ఈడు గల పిల్లలు, పదో తరగతి ఉత్తీర్ణత వంటి అంశాలపై చర్చించారు. డీఈవో మాట్లాడుతూ గణితం, ఆంగ్లం, సైన్స్ వంటి సబ్జెక్టులపై ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన పిల్లలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులతో పాటు సబ్జెక్టు ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. సమావేశంలో ఎంఈవో రాగన్న, కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతి, హెచ్‌ఎంలు భోజరాజు, విఠోభరావు, లచ్చప్ప, వెంకటేష్, రామ్మోహన్, భూషణం, రంగనాథ్, రంగస్వామి, రామ్మోహన్, సీఆర్‌పీలు భీమేష్, బంగారప్ప పాల్గొన్నారు.

## గుంతలమయంగా రహదారి


రహదారిపై ఉన్న గుంతల్లో నిలిచిన వర్షపునీరు

**గోనెగండ్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గాజులదిన్నె క్రాస్ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల, నెరుడుప్ప, ఒంటే దుదిన్నె, గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వర్షాలు కురవడంతో గుంతలు మరింత పెద్దవి అయ్యాయి. గుంతలలో వర్షపు నీరు చేరడంతో ద్విచక్రవాహ నదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహన దారులు, ఆటోలు గుంతలలో పడి గాయాలపాలైన సంఘట నలు ఉన్నాయి. ఇదే రహదారి వెంట గోనెగండ్ల నుంచి పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు, కపట్రాళ్ల క్రాస్ రోడ్డునుంచి పత్తికొండకు అలాగే ఎర్రబాడు మీదుగా ఈదులదేవర బండ, కోడుమూరు గ్రామాలకు బస్సులు, ఆటోలు వెళ్తుంటాయి. రహదారిని బాగు చేయాలని పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికి ఫలితం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తు న్నారు. రహదారి మొత్తం గుంతపడి పోవడంతో ద్విచక్రవాహ నాలను, ఆటోల రాక పోకలకు ఇబ్బందిగా మారిందని, దీనికి తోడు ఈ గ్రామాల విద్యార్థులు చదువుకునేందుకు గోనెగండ్లకు రావాల్సి ఉండటంతో సైకిళ్లు, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతు న్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పోలీసులకు యూనిఫాం పంపిణీ చేసిన పీఠాధిపతి


యూనిఫామ్ పంపిణీ చేస్తున్న పీఠాధిపతి

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి):** రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలను విజయవంతం చేసిన మంత్రాలయం పోలీసులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు యూనిఫామ్ లను అందజేశారు. ఆదివారం స్వామిజీ రూములో మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుళ్లు, హోంగార్డులకు, మహిళా పోలీసులకు యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు మల్లికార్జున స్వామి, ఆంజనేయులు, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**గోనెగండ్ల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** యువత క్రీడల్లో రాణించాలని మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, ఐ టీడీపీ కన్వీనర్ రాంపురం రఫీక్, టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు అన్నారు. నవరాత్రులు, దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని గోనెగండ్లలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం మాట్లాడుతూ మాజీ మంత్రి దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి స్మరకార్థం నిర్వహిస్తున్నామని, ఈ పోటీలు 23వ తేదీన ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐరన్‌బండ బాషా, జిలాని బాషా, జయపాల్, రవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉల్లి రైతులకు అండగా సీఎం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**కౌతాళం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఉల్లిరైతులకు సీఎం చంద్రబాబు అండగా నిలిచారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప అన్నారు. ఆదివారం కౌతాళంలో చెన్నబసప్ప స్వగృహం వద్ద ఉల్లి రైతులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉల్లి ధర పతనమవ డంతో రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు హెక్టారుకు రూ.50వేలు అందించడం హర్షనీయమన్నారు. రైతులు టీడీపీ ప్రభుత్వానికి అండగా ఉంటారన్నారు. టీడీపీ నాయకులు డమ్మలదిన్నె రమేష్‌గౌడ్, కాశీవిశ్వనాథ్, రాజబాబు, సిద్దు, రహిమాన్, రైతులు పుగ్గి నాగ, భీమయ్య, ఉసేని, రఘరాం ఉన్నారు.

## రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలు

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, కర్నూలు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి రాఘవేంద్ర తెలిపారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లా డుతూ ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించే పోటీలకు రాష్ట్రం లోని 13 జిల్లాల నుంచి బాల బాలికలు పాల్గొంటారన్నారు. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ప్రారం భిస్తారన్నారు.

## దళారులను నమ్మొద్దు: బీజేపీ


బీజేపీ నాయకుడు గురురాజ దేశాయ్

**ఎమ్మిగనూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరులోని కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఉచిత వైద్యశిబిరాలు పెడుతున్నాయని చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న దళారులను నమ్మొద్దని బీజేపీ నాయకుడు గురురాజ దేశాయ్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు పేదప్రజలకు ఉచితంగా వైద్యం చేస్తామని వైద్యశిబి రాలను ఏర్పాటు చేసి తాము నియమించుకున్న దళారుల ద్వారా ప్రజలను శిబిరాలకు రప్పిస్తున్నారన్నారు. శిబిరాలకు వచ్చిన రోగు లకు లేనిపోని భయాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. వైద్య శిబిరాలకు వెళ్లే వారు అక్కడ చేయించుకున్న పరీక్షలను ఫ్యామిలి వైద్యుల దగ్గర పరిశీలించుకొని నిర్ధారణ చేసుకోవాలన్నారు.

## టీడీపీలో చేరిక

● కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాఘవేంద్రరెడ్డి సోదరులు


పార్టీలోకి ఆహ్వానిస్తున్నరామకృష్ణా రెడ్డి, రఘునాథ్‌రెడ్డి

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** పెద్దకడుబూరు మండలం నాగలపురం గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరారు. ఆదివారం మండలంలోని మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో వీరభద్ర, చంద్రశేఖర్, శరణబసవ,గంగన్న, మంజునాథ్, మల్లిఖార్జున, ఈరన్న, నరసింహులు తదితరులు వైసీపీ నుంచి టీడీపీలో చేరగా, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణా రెడ్డి, టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం చూసి టీడీపీలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న, దబ్బుల నరసింహా, గుర్మింటి భీమిరెడ్డి, నాగరాజు, బూదిరెడ్డి, రామయ్య, జయరాం, కేశన్న, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

## మఠంలో పూజలు


పూజలు చేస్తున్న బండేగురు స్వామి

**నందవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** మండలంలోని పూల చింత గ్రామంలోని మఠం బండేగురుస్వామి ఆలయంలో అదివారం అమావాస్య పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఉప పీఠాధిపతి బండేగురు స్వామి, గ్రామ సర్పంచ్ బండేగురు అక్కామాంబ దేవి ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సనాతన ధర్మం పాటించి అందరూ సన్మార్గంలో నడవా లని ఉప పీఠాధిపతి బండేగురు స్వామి ఉపదేశించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులను ఆయన ఆశీర్వదించారు.

## జాలవాడిలో క్షుద్రపూజల కలకలం

**పెద్దకడబూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని జాలవాడి గ్రామంలోని టీడీపీ నాయకుడు ముక్కన్న పొలంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఆదివారం అమావాస్య కావడంతో తన మిరప పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేశారన్నారు. అలాగే తన ఇంటిపై కూడా పూజా సామగ్రి పారవేశారన్నారు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షుద్రపూజలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## 'ఆత్మ నిర్బర్ భారత్'కు కట్టుబడి ఉండాలి

**పెద్దకడబూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):** ప్రధాని మోదీ పిలుపు మేరకు ఆత్మ నిర్బార్ భారత్‌కు ప్రతి ఒక్క భారతీయుడు కట్టుబడి ఉండాలని తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి శశిరేఖ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని యువత విదేశీ మోజును వీడనాడి తమ నైపుణ్యాన్ని, మేదస్సుని, శక్తి సామర్థ్యాన్ని మన దేశ అభివృద్ధికి వినియోగించాలన్నారు. స్వదేశీయతపై మక్కువ పెంచుకోవాలన్నారు.

## శ్రీమఠంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


శ్రీమఠంలో పాలకుర్తి తిక్కారెడ్డి, నాయకులు

**మంత్రాలయం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామిని టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మహా ముఖద్వారం వద్ద జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. మొదట గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి పరిమళ ప్రసాదమిచ్చి సత్కారించారు. టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, భరద్వాజ్ శెట్టి, టీడీపీ బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, విజయ రామిరెడ్డి, అబ్దుల్లా, కేశన్న, సున్నం రామకృష్ణ, నరసింహా, యోబు, సుంకప్ప, పైబావి నర్సారెడ్డి,వీరారెడ్డి, దస్తగిరి పాల్గొన్నారు.